క్లుప్తంగా

నేటి నుంచి నగరంలో స్పోర్ట్స్ మీట్

కడప కార్పొరేషన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గురువా నుంచి స్పోర్ట్స్ మీట్–2025 నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మనోజ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మున్సిపల్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ రెండు రోజుల పాటు క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. 100 మీటర్లు, 400 మీటర్లు, 4.400 మీటర్ల రన్నింగ్ రేస్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడల పోటీలు జరుగుతాయని తెలిపారు. రిజిష్టర్ చేసుకున్న 8, 9, 10వ తరగతుల ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్ విద్యార్థులు ఈ ఈవెంట్లలో పాల్గొంటున్నారని తెలిపారు.

హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి


నగరంలో పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ అన్నారు. జై బాపూజీ.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు, మైనారీల అణచివేతకు బీజేపీ ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో బీజేపీ దుర్మార్గాన్ని ఎదుర్కొంటామని హెచ్చరించారు. హోంమంత్రి అమానుష ప్రకటనకు వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. మతం పేరుతో విద్వేషాలు సృష్టించి దేశాన్ని చిన్నాభిన్నం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చట్టం ప్రకారం బకాయిల వసూళ్లు


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ గుర్రప్ప

కడప అగ్రికల్చర్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో రుణ బకాయిలను ఏపీ సహకార సంఘ చట్టం 1964ను అనుసరించి వసూలు చేయాలని డీసీసీ బ్యాంకు స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప పేర్కొన్నారు. కడప డీసీసీ బ్యాంకులో బ్యాంకు సూపర్‌వైజర్లు, సేల్స్ అధికారులతో మొండి బకాయిల వసూళ్లపై బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాయిదా మీరిన బకాయిలు రికవరీ చేయాల్సిన పద్ధతులను వివరించారు. బకాయిదారులను ప్రత్యక్షంగా కలిసి వారికే చట్టం వివరించాలని, నిర్లక్ష్యం చూపిన వారి స్థిర, చరాస్తులను వేలం వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం నారాయణరాజు, చంద్రశేఖర్, ఛీప్ మేనేజర్ అంజనేయరెడ్డి, మేనేజర్లు, బ్యాంకు సేల్స్ అధికారులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలల విలీనం వద్దు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పాఠశాలల పునర్నిర్మాణంలో భాగంగా రాష్ట్రంలోని ఉర్దూ పాఠశాలలు, తరగతులను తెలుగు, ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో కలపవద్దని ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్‌మక్బూల్‌బాషా డిమాండ్ చేశారు. నగరంలోని ఆప్ కీ ఆవాజ్ కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ కొన్ని జిల్లాల్లో మండల విద్యాధికారులు తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాలల్లో ఉర్దూ పాఠశాలలను విలీనం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకురాకుండానే విలీనం చేయడం సమంజసం కాదన్నారు. 45 మంది విద్యార్థులున్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను.. మోడల్ ఉర్దూ పాఠశాలలుగా స్థాపించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వేయి ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలన్నారు. ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో 238 ఉర్దూ భాషా పండితులను నియమిస్తామని చెప్పిన అధికారులు దాదాపు పది నెలలైనా పట్టించుకోలేదన్నారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా డ్రాపౌట్‌లు పెరిగిపోతున్నాయన్నారు.

అంధ విద్యార్థి ప్రతిభ


విద్యార్థికి బహుమతి అందిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: రిపబ్లిక్ డే సందర్భంగా కడపలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి దేశభక్తి పాటల పోటీల్లో కడప అంధుల ఉన్నత పాఠశాల విద్యార్థి నాజియా తబుసం ప్రతిభ చాటారు. డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి ఆమెకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రమీల, ఎబినైజర్లు పాల్గొన్నారు.

నీ నామ కీర్తన.. సదా రక్ష రామా

కష్టాలకు చెదరని నీ మనో నిబ్బరత
లక్ష్య సాధనలో అకుంఠిత కార్యాచరణ
భక్త పరిరక్షణలో అపరిమిత కారుణ్యం..
ఎన్నని ఎంతని ఏమని పొగడుదు రామా
నీ నామ కీర్తన మాకు సదా రక్ష రామా
అంటూ కడప నగరంలో భక్తజనం కీర్తించారు. నీవే మాకు రక్ష రామా అంటూ వేలాది జనం ముందు అడుగులు వేస్తుండగా.. అలంకరించిన వాహనంపై శ్రీరామ ప్రతిమతో శోభా యాత్ర అత్యంత వైభవంగా సాగింది. వీధి వీధినా ఈ శోభా యాత్రను తిలకించిన జనం మంత్ర ముగ్ధులయ్యారు. భక్తి పారవశ్యంతో పాల్గొన్నారు. – కడప నెట్‌వర్క్


శ్రీరాముడి శోభా యాత్రలో పాల్గొన్న జన సందోహం


చిన్నారుల సీతారాముల వేషధారణ


అతిబలవంతా.. హనుమాన్


మంగళ వాయిద్యాలతో భక్తులు


శోభాయాత్రముందు కళాకారుల విన్యాసాలు


సీతారామ కల్యాణం నాటకంలో పుష్పాల జల్లులు


యాత్రలో కత్తులతో ప్రదర్శన


నృత్యం చేస్తున్న మహిళలు


చిన్నారుల కళల ప్రదర్శన


కడప నగర మహిళల కోలాట ప్రదర్శన


స్వామీ మమ్ము దీవించు


శ్రీరామ ప్రతిమ వద్ద శివతాండవం


శోభాయాత్రకు మేము సైతం


కాషాయ వస్త్రధారణతో భక్తులు


జై శ్రీరామ్ అంటున్న చిన్నారి

సమస్యలు పరిష్కరించకపోతే పోరుబాట


డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలనుపరిష్కరించని పక్షంలో ఫిబ్రవరి నుంచి పోరుబాట చేపడతామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదనవిజయకుమార్, పాలెం మహేష్‌బాబు యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కడప కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వర నాయుడును కలిసి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే 12వ పీఆర్సీని అమలుచేయాలన్నారు. 2023 జూలై, 1వ తేదీ నుంచి 12వ పీఆర్సీని అమలుచేయాల్సి ఉన్నప్పటికీ అమలుచేయడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అండతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వారిని పూర్తిగా విస్మరిస్తోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఏడు మాసాలు పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.30 వేల కోట్ల బకాయిలకు చెల్లింపులు లేవన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, సుజాతారాణి, నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఎజాస్‌అహ్మద్, ఈదరి బాలజ్యోతి, రూతు ఆరోగ్యమేరి, ప్రభాకర్, కేదార్‌నాథ్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

కడప కల్చరల్ : జీవిత బీమా సంస్థ ప్రకటించిన మేరకు 2700 అసిస్టెంట్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయం ఆవరణలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ క్లాస్–4 నియామకాలు చాలాకాలంగా జరగలేదని, తక్షణమే ఆ క్యాడర్లలో రిక్రూట్‌మెంట్ చేపట్టాలన్నారు. గత రెండేళ్లలోనే 5,400 మంది సిబ్బంది తగ్గిపోయారని, రాబోయే మూడేళ్లలో పెద్ద సంఖ్యలో సిబ్బంది రిటైర్ అవుతారని తెలిపారు. క్లాస్ 3, 4 కేడర్లలో వెంటనే రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే కాలంలో సమ్మె చేపట్టేందుకు సిద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అక్బర్ బాషా, వసుప్రద, వారిజాతమ్మ, రాజు, రత్న కిషోర్, కుమార్, రఘు, జయచంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో 913 పశువులకు వైద్య సేవలు

కమలాపురం : మండలంలోని జె.కొత్తపల్లెలో బుధవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 913 పశువులకు వైద్య సేవలు అందించినట్లు ఏడీ ఉత్తయ్య, మండల పశు వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఇందులో 24 పశువులకు సాధారణ చికిత్సలు, 7 గర్భకోశ వ్యాధులు చికిత్సలు, 167 పశువులతో పాటు715 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి పరిశ్రమ రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించిందన్నారు. మండలంలో ప్రతి రోజు రెండు గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి ప్రతి పశువుకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు

నగర పాలక కమిషనర్ మనోజ్ రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

కడప కార్పొరేషన్: కడప నగరంలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని కమిషనర్ మనోజ్ రెడ్డి ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా ప్రకాష్ నగర్, సింగపూర్ టౌన్‌షిప్ ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. కలెక్టర్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న వీధిలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కమర్షియల్ షాపు నుంచి వచ్చే వ్యర్థపు నీటిని డ్రైనేజీలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలువల్లో పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజ్ వద్ద నిర్మాణ పనులను పరిశీలించారు. అనుమతిలేని రూములను తక్షణమే తొలగించాలని ఆదేశించగా, టౌన్ ప్లానింగ్ అధికారులు మధ్యాహ్నం ఆ రూములను జేసీబీ సాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్, రత్నరాజు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సస్యరక్షణతో వరిలో మంచి దిగుబడులు


వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : వరి పంటలు సాగు చేసే రైతులు ప్రతి 2 మీటర్లకు 30 సెం.మీ. చొప్పున కాలిబాటలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం పట్టణ పరిధిలోని వరి పంటలను ఆమె పరిశీలించారు. వరి పంటల సాగులో మెలకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి 2 మీటర్లకు 30 సెం.మీ. చొప్పున బాటలు ఏర్పాటు చేస్తే పంటకు గాలి, వెలుతురు, ఉష్ణోగ్రత అందుతుందన్నారు. గట్ల పైన పెరిఫెరల్ ప్లాంటేషన్ బంతి, కంది, మొక్కజొన్న, సస్బేనియా వంటివి నాటుకోవాలన్నారు. కాండం తొలుచు పురుగు, ఆకు ముడత నివారణకు ఏకరానికి 8 లింగాకర్షక బుట్టలు, 10 నుంచి 15 పక్షి స్థావురాలు, పెట్టుకోవాలని తెలియజేశారు. తుంచి నాటితే బ్రౌన్ తిలుచు పురుగు గుడ్లు పెట్టకుండా నివారించ వచ్చన్నారు.

యువకుడు అదృశ్యం


నరసింహులు

కడప అర్బన్: కడప నగరంలోని రిమ్స్ పీఎస్ పరిధిలో రెండు ప్రాంతాలకు చెందిన ఇరువురు వేర్వేరు సమయాల్లో అదృశ్యమైనట్లు వారి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. కడప నగరంలోని బుడ్డాయపల్లికి చెందిన నాగేటి నరసింహులు(37) ఐటీసీలో సేల్స్‌మేన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 19వ తేదీ నుంచి అతడు కనిపించడం లేదని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళ కనిపించలేదని...


ప్రమీల

కడప అర్బన్: కడప నగరంలోని రామకృష్ణ నగర్ చర్చి సమీపంలో నివాసముంటున్న మోటుపల్లి ప్రమీల(21) ఈ నెల 20వ తేదీ నుంచి కనిపించడం లేదని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వీరి ఆచూకీ తెలిసిన వారు నేరుగా తమను సంప్రదించవచ్చన్నారు. ఫోన్‌లో సీఐ– 9121100523కిగానీ, ఎస్ఐ 9121100524కు గానీ సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

చింతకొమ్మదిన్నె : అధిక పాలఉత్పత్తికి పశువులను ఆరోగ్యంగా ఉంచాలని, ఇందుకోసం పశు కాపరులు జాగ్రత్తలు పాటించాలని పశు వైద్యులు సూచించారు. జిల్లా వ్యాప్తంగా పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణలో భాగంగా మండలంలోని లక్కిరెడ్డిపల్లిలో పశువులు, మేకలు, గొర్రెలకు బుధవారం నట్టల నివారణ మందు తాగించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం, సీజనల్ వ్యాధులు, నివారణకు, అధిక పాల ఉత్పత్తి పెంచుటకు తదితర వాటిపైన పశుసంవర్ధక ఏడి శ్రీధరలింగారెడ్డి, పాడి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ డాక్టర్ చంద్రకిషోర్ పాల్గొన్నారు.

నేటి సమాజంలో విద్యార్థులే ప్రజా కవులు

విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి రవికుమార్


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

కడప ఎడ్యుకేషన్: నేటి సమాజంలో విద్యార్థులే ప్రజా కవులుగా మారాలని తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి రవికుమార్ అన్నారు. యోగి వేమన విశ్వ విద్యాలయంలో బుధవారం వేమన జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన తాత్విక చైతన్య యాత్ర పేరిట అధికారులు, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో స్థానిక పరిపాలన భవనం నుంచి సైన్సు బ్లాక్ మీదుగా పరిపాలన భవనం వరకు ర్యాలీ చేశారు. అనంతరం ప్రధాన ద్వారం వద్ద వేమన విగ్రహానికి ఉప కులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథ రెడ్డి, ఆచార్య పుత్తా పద్మా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నమయ్య సెనెట్ హాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ వేమన తొలిసారిగా ఇతిహాసాలు, పురాణాలతో సంబంధం లేకుండా జీవితంలోని అంశాలను చెప్పారన్నారు. నాలుగు వందల ఏళ్ల కింద వేమన కోరున్న సామాజిక భావజాలం నేటికీ కుదరలేదన్నారు. వేమనది పుస్తకాల భాష కాదని తాత్వికతతో కూడిన సణుగుడు, గొణుగుడులే పద్యాలుగా వచ్చాయన్నారు. ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వేమన పద్యాల్లో మానవ పరిణామ క్రమం కనిపిస్తుందని, మూఢనమ్మకాలను ఛీకొట్టేలా, సర్వమానవాళి ఒకటే అనే తలంపు తెచ్చేలా ఆదర్శంగా ఉంటాయన్నారు. ప్రతి విద్యార్థి ఆ పద్యాలలోని మూలాలను గ్రహించి నడుచుకోవాలన్నారు. ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ వేమన పద్యాలు సామాన్యుల నాలుకలపై నాట్యమాడుతాయన్నారు. పద్యంలోని సారాన్ని విద్యార్థులు గ్రహించాలని కోరారు. ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ నేటి సమాజంలో మానవత్వాన్ని నెలకొల్పే దిశగా పద్యాలు ఇచ్చారన్నారు. అనంతరం మేడిపల్లి రవికుమార్‌ను వైవీయూ సిబ్బంది సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్లు, ఆచార్యులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.